

# పంజా

యం.ఆర్. రాజాజీ

పులొచ్చినా... పుట్రొచ్చినా... నాన్నా! అని గట్టిగా పిలువు. నేను ఆ కొండదిగువనే కట్టెలు కొడుతూ ఉంటానని చెప్పి రామయ్య వెళ్ళిపోయాడు.

కొంటె కిష్టయ్య ఆ మేకల్ని మేపుతూ ఉండగా... హఠాత్తుగా ఒక తమాషా చేద్దాం అనిపించి వాళ్ళ "నాన్నని ఆట పట్టించడానికి గట్టిగా "నాన్నా—పులి". అని అరిచాడు. పాపం! ఆ రామయ్య అది విని గొడ్డలిభుజాన వేసుకొని పరిగెత్తుకొచ్చాడు..."

"అమ్మా నాన్నొచ్చాడు" అని చిన్నాడు అనడంతో సీత కథ చెప్పడం ఆపి వీధి గుమ్మంలోకి చూసింది.

రాజారావు మొఖం ఎండకు కందగడ్డలా వుంది. కాళ్ళకు జోళ్ళు కూడా లేవు. పెరిగిన గడ్డం, మాసిన బట్టలతో విసురుగా యింటిలోకి అడుగు పెట్టాడు.. గదంతా గుప్పున వాసన కొట్టింది.

చిట్టితల్లి పరుగున వెళ్ళి "నాన్నా" అంటూ కాళ్ళను చూట్టేసుకొంది.

రాజారావు చిరాగ్గా చీదరించుకొని చిట్టి తల్లిని దూరంగా గెంటేసి... లోపలి గదిలోకెళ్ళి... సీతా అని పిలిచా డు.

సీత కంగారుగా లోపలికెళ్ళి దీనంగా నిలబడింది.

"నీ దగ్గర డబ్బేమైనా ఉందా!"

"మీకు తెలియని డబ్బు నా దగ్గర ఎక్కడుంటుం దండి. ఈ పూట ప్రక్కింటి పిన్నిగార్ని అడిగి బియ్యం తీసుకొని వంట చేసాను. లేవండి భోజనం వడ్డిస్తాను" అంది సీత.

"నీ ముష్టి భోజనం అక్కర్లేదు. నేను వందలూ వేలూ అడగటంలేదు. ఒ ఐదురూపాయలు అడుగుతున్నాను. ఉద్యోగం ఊడపోయిందని, నేనేమీ సంపాదించడం లేదని, ఈ రోజు నా బ్రతుకు హీనమై పోయింది."

"ఎందుకండీ! మిమ్మల్ని మీరే కించపర్చుకుంటారు. నా జీతంతో ఈ సంసారాన్ని ఎలా ఈదుకొస్తున్నానో ఎప్పుడైనా ఆలోచించారా? ఈ పాడు వ్యసనం వల్లేగా మీ ఉద్యోగం పోయింది. నా ముఖం... ఆ బిడ్డల ముఖం చూసి ఇకనైనా త్రాగటం మానేయండి. మమ్మల్ని ఏడిపించి మీరు పొందే ఆనందం ఏముంది?" అని రుద్దకంఠంతో అంది సీత.

"నాకు శ్రీరంగ నీతులు చెప్పక్కర్లేదు. ముందీ గదిలోంచి బయటకెళ్ళు" అని ఉక్రోషంతో సీతవైపు చూసాడు రాజారావు.

సీత కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ఇక ఒక్కక్షణం అక్కడ ఉండలేక గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది.

"అమ్మా! "నాన్నా—పులి" అని కిష్టిగాడు అరిచాడు. అప్పుడు వాళ్ళ నాన్నొచ్చి ఏం చేసాడే" అని గోముగా అడిగాడు చిన్నాడు.

కళ్ళలో పేరుకున్న కన్నీటిని పిల్లలకు కనిపించకుండా చీర కొంగుతో అద్దుకుంటూ వంటగదిలోనికి వెళుతూ "కథ తర్వాత చెప్తాగాని, భోజనం చేద్దురుగాని రండి" అని పిల్లల్ని పిలిచింది.

రాజారావు దగ్గు మరింత ఎక్కువైంది. సీత గబగబా వెళ్ళి "మంచినీళ్ళు తీసుకు రమ్మంటారా" అంది.

"నువ్వెళ్ళి నీతి కథలు చెప్పు, నాకవసరమైనప్పుడు పిలుస్తాను. కాస్త తులసీ తీర్థం పోద్దువుగాని... వెళ్ళు" అని కఠినంగా అన్నాడు.

సీత చిన్నబోయిన మొఖంతో పిల్లల దగ్గరకు వచ్చింది.

"కిష్టిగాణ్ణి వాళ్ళ నాన్న ఏవని కోప్పడ్డాడే" అన్నాడు భోజనం దగ్గర కూర్చున్న చిన్నాడు.

సీత కడుపులో కదులుతున్న బాధను అణుచుకొని "కథ రేపు చెప్తాను గాని ముందు అన్నం తినండి" అంటూ పిల్లలిద్దరికి అన్నం తినిపిస్తోంది సీత.

రాజారావు గదిలోంచి బయటకు వచ్చి సీత వంక తీక్షణంగా చూసి గొణుక్కొంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన వైపే చూస్తూ సీతా పిల్లలు అలా ఉండిపోయారు.

* * *

రాజారావుతో ఒకప్పుడు కలిసి పనిచేసిన సత్యమూర్తి యిల్లది. రాజారావు ఆత్రుతగా వెళ్లి తలుపు తట్టాడు.

సత్యమూర్తి తలుపు తీసి రాజారావును చూసి "ఏమిటోయ్ రాజారావు యిలా వచ్చావు?" అన్నాడు.

"ఏంలేదు... నిన్ను చిన్న హెల్ప్ అడుగుదాం అని వచ్చాను. మా చిట్టి తల్లికి ప్రొద్దుట్నుంచి ఒకటే వాంతులు. డాక్టర్‌కి చూపించాలి. ఓ పది రూపాయలు సర్దుతావని వచ్చాను" అన్నాడు.

"అయ్యో! పాపం, అలాగా. మరి యింతవరకు ఏం చేశావోయ్. అలాగే తీసుకెళ్ళు. ఏమే కామాక్షి, మన రాజారావు కూతురుకి బాగాలేదట, డాక్టర్ దగ్గరకు తీసుకెడతాడట. నా షర్ట్ జేబు లో డబ్బుంది. తీసకొచ్చి పదిరూపాయలియ్యి" అన్నాడు జాలిగా.

కామాక్షి పది రూపాయలు తీసుకొచ్చి రాజారావు కిస్తూ ...." త్వరగా తీసుకెళ్ళండి. కాస్త తగ్గిన తరువాత పిల్లల్ని వదినగార్ని ఒకసారి తీసుకురండి" అంది.

"అలాగే నండి, తప్పకుండా తీసుకు వస్తాను" అంటూ వాళ్ళ మొఖాల్లోకి చూడకుండా గబగబా వెళ్ళిపోయాడు.

* * *

రఘుపతి రాజారావును పడిపోకుండా గట్టిగా ఓ చేత్తో పట్టుకొని... ఓ చేత్తో తలుపు తట్టాడు. సీత తలుపు తీసి రఘుపతిని, భర్తను చూసి బాధతో నిండిపోయింది.

"చెల్లమ్మా...! బజారులో తూలుతూ లారి క్రింద పడబోయాడు. చూసి తీసుకొచ్చాను. రోజు రోజుకి వీడి వ్యవహారం ఏం బాగోవటం లేదు." అంటూ మంచం మీద పడుకోబెట్టాడు.

"నా పరిస్థితి ఏ దేవుడితో చెప్పుకోనన్నయ్యా. భర్తను చూసి బ్రతక లేకపోతున్నాను బిడ్డల్ని చూసి చా వలేక పోతున్నాను" అంటూ బావురు మంది.

రఘుపతి చలించిపోయాడు. "ఊరుకో చెల్లమ్మా! నేనూ శతవిధాల ప్రయత్నం చేస్తున్నాను వీడి చేత తాగుడు మాన్పించాలని... ఎక్కడైనా ఉద్యోగం చూడాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాను. మధ్యాహ్నం నా దగ్గరకు వచ్చాడు. ఐదు రూపాయలు కావాలన్నాడు. నేను యివ్వ లేక కాదు. కాని అలా అడిగినప్పుడల్లా యిచ్చి వాడి వ్య సనానికి నేను కారణమౌతున్నానేమో అనిపిస్తుంది. అందుకే బాగా చివాట్లు పెట్టి పంపాను" అన్నాడు.

"అన్నయ్యా! తెగించి మాట్లాడుతున్నానని మీరనుకోపోతే ఒక మాట చెబుతాను. ఆయన ఈ

**కిటికీలోంచి రాజారావు ముఖం మీద ఎండ తీక్షణంగా పడుతోంది. సీత నెమ్మదిగా గదిలోకి వచ్చి 'ఏమండి' అంది. రాజారావులో చలనం లేదు. కుదుపుతూ మళ్లీ పిలిచింది. రాజారావు కళ్ళు తెరిచి చూశాడు.**



జన్మలో మారరు. అనుక్షణం ఈ యిల్లు నరకంలా వుంది. ఏకేకలు పోతూ ఆయన కోసం ఎదురుచూస్తున్న నాకూ పిల్లలకు దొరుకుతున్నది ఆప్యాయతా... అనురాగం కాదన్నయ్యా... ఆయన నోటికొచ్చిన తిట్లు... చేతికొచ్చిన దెబ్బలు అన్నయ్యా... ఆడదంటే ఆయన దృష్టిలో ఒక మరబొమ్మ. మగాడు అహంకారంతో ఆడదాని వ్యక్తిత్వాన్ని బానిస మనస్తత్వంగా మలుస్తున్నాడు. అది నేను సహించలేక పోతున్నాను. ఇటు వంటి భర్తతో జీవితాన్ని పంచుకోవడం కన్నా తుంచుకోవడం మెరుగు. అందుకే అన్నయ్యా! ఒక నిర్ణయానికి వచ్చా ను. పిల్లల్ని తీసుకొని ఎక్కడికైనా వెళ్ళిపోతాను'' అని వణికి పోతూ గోడకు జారబడిపోయింది.

''వద్దు చెల్లమ్మ! అంతపని చేయకు. ఇటువంటి పరిస్థితిలోనే నిగ్రహించుకోవాలి. నిర్ణయం తీసుకోవడం క్షణకాలం. కాని పరిణామాలు జీవితకాలంలో నిలుస్తాయి. వేలు మీద గోరుచుట్టు అయిందని వేలును కోసుకుంటామా. మందేసి నయం చేసుకోవాలి. తాగుడు మానేస్తే వాడంత మంచివాడే లేడు. నేను వాడిచేత మానిపించగలననే నమ్మకం యింకా వుంది. ఓ ఫ్యాక్టరీలో ఉద్యోగం ప్రయత్నిస్తున్నాను. తప్పకుండా దొరుకుతుంది. ఈ అన్నయ్య మాట వినమ్మా'' అన్నాడు.

తోడబుట్టిన వాళ్ళు లేరనే లోటు మీరు తీరుస్తున్నారన్నయ్యా! ఆయన స్నేహితులైన పాపానికి ఈ బాధను మీరు కూడ నవ్వుతూ భరిస్తున్నారా'' అంది.

''అదేవిటమ్మా! నా చెల్లెలొకటి... నీవొకటీనా నీ బాధ నా బాధ కదా? మరోవిధంగా ఎప్పుడూ అనుకోవద్దు. ఏమైనా అవసరం అనుకుంటే కబురు చెయ్యి. మొహమాట పడవద్దు. రోజు నేను ఏదోటైంలో వచ్చి చూసి వెడతాను. రేపు వచ్చి వీడిని ఆ ఫ్యాక్టరీకి తీసుకు వెడతాను. వస్తాసమ్మా... ధైర్యంగా ఉండు'' అంటూ వీధిలోకి దారి తీసాడు రఘుపతి.

సీత కన్నీళ్ళ తెరల్లోంచి రాజారావు మొఖంలోకి చూస్తూ అలాగే ఉండిపోయింది.

* * *

పిల్లలిద్దరికీ స్కూలు యూనిఫారం వేసి... తల దువ్వుతోంది సీత. రాజారావు ఇంకా లేవలేదు. రెండుమూడు సార్లు గదిలోకి వెళ్ళి లేపడానికి ధైర్యం చాలక తిరిగి వచ్చేసింది సీత. అవతల స్కూలు టైం అయిపోయింది. సీతకు కంగారు ఎక్కువైంది.

కిటికీలోంచి రాజారావు మొఖం మీద ఎండ తీక్షణంగా పడుతోంది. సీత నెమ్మదిగా గదిలోకి వచ్చి... ''ఏమండీ'' అంది. రాజారావులో చలనం లేదు. చేత్తో కదుపుతూ మళ్ళా పిలిచింది.

రాజారావు బద్ధకంగా కళ్ళుతెరచి ఏమిటన్నట్లు చూసాడు.

''నాకు స్కూలు టైం అవుతోంది. ఫ్లాస్కులో కాఫీ పోసి వుంచాను. టేబుల్ మీద భోజనం పెట్టాను. లేచి స్నానంచేయండి వీధి తలుపు వేసుకోండి. మేం వెడుతున్నాం.''

''టైం ఎంతయింది సీతా?''

''తొమ్మిదయింది! మీ కోసం రఘుపతి

అన్నయ్యగారు వస్తానన్నారు. ఏదో ఫ్యాక్టరీలో ఉద్యోగం ఉందట. మిమ్మల్ని తీసుకెడతానన్నారు.''

''సీతా — ఆనక స్కూలుకు వస్తా డబ్బేమైన అడ్వాన్సు తీసుకొని ఉంచు.''

''మొన్ననే వందరూపాయలు తీసుకొని యింటి అద్దెకట్టాను. యిప్పుడు మళ్ళా అడిగితే యివ్వరు.''

''పండగ అడ్వాన్సు అని చెప్పితీసుకో ఎందుకివ్వరు''

''మనం అడిగినప్పుడల్లా యివ్వడానికి వాళ్ళేమైనా అక్కడ దాచుంచార్రా?''

''దాచి వుంచలేదు కాబట్టే అడ్వాన్సు అడగమంటు న్నా. జీతంలో కట్ చేసుకుంటారు?''

''ఇలా కావాలనుకున్నప్పుడల్లా డబ్బు తీసుకుంటె నెలాఖరులో ఏం వస్తుంది చెప్పండి. మళ్ళా నెలంతా ఎలా గడుస్తుంది.''

''అయితే యింతకీ డబ్బు అడగనంటావ్. అవున్లే ఎలా అడుగుతావు. నాకోసం డబ్బు అడగటం నీకు చిన్నతనం.''

''ఏవిటండీ ఆ మాటలు. మీకోసం నడివీధిలో అడుక్కోడానికి కూడా సిగ్గు పడను. కాని నేను మిమ్మల్ని ఈ స్థితిలో చూడ్డానికి సిగ్గుపడుతున్నాను.''

''సీతా! మాటలు సరిగ్గారానియ్. నేనేమీ సిగ్గుతో తల దించుకోవాల్సిన పని చేయ్యటం లేదు. నా డబ్బుతో నేను తాగుతున్నాను''.

''ఏమిటండీ మీరు చేస్తున్న గొప్పపని. నలుగురు స్నేహితుల్నీ యాచించి ఒళ్ళు తెలియకుండా తాగడం మంచి పనా?''

సీత చెంప మీద ఛెళ్ళుమంది. ఒక్కసారిగా తూలి అద్దాల బీరువా మీద పడింది. అద్దాలు ముక్కలైపోయాయి. సీత మనస్సు ముక్కలైపోయింది. సీత ఆపుకోలేని దుఃఖం...తో మోకాళ్ళ మధ్య తల పెటుక్కొని అలాగే కూర్చుండి పోయింది. తల్లి ఏడుపు వినిపించి పిల్లలు పరుగున గదిలోకి వచ్చి బిక్కు బిక్కు మంటూ అలా చూస్తూండిపోయారు.

''వెళ్ళండి అంతా కట్టగట్టుకొని ఏ గంగలోనో దూకండి. ఇటు వంటి పాడు కొంపలో ఉండటం నాది తప్పు. పోతాను. పోయి ఏ రైలు కిందో పడి చావడం మంచిది'' అంటూ రాజారావు గబగబా వీధి గదిలోకి వెళ్ళాడు.

చిన్నాడు కళ్ళలో నిండిన నీళ్ళతో ''పోతే నువ్ పో... అమ్మనెందుకు కొడతావ్'' అన్నాడు.

రాజారావు ఒళ్ళు తెలియని కోపంతో గబగబా వెనక్కి వచ్చి చిన్నాడి రెక్క పట్టుకొని కసికొద్ది కొట్టాడు. సీత మొల్లు మంటూ వచ్చి అడ్డుపడింది. సీతను బలంగా డొక్కలో తన్నాడు రాజారావు.

''అమ్మా! అంటూ అలాగే కుప్పలా కూలిపోయింది సీత. పిల్లలిద్దరు ''అమ్మా'' అంటూ తల్లిపై పడ్డారు.


''అమ్మను చంపొద్దు'' అంటూ చిన్నాడు తండ్రి కాళ్ళను చుట్టేసాడు.

రాజారావు అచేతనుడైపోయాడు. నెమ్మదిగా వంగి సీత మొఖంలోకి చూసాడు. ''సీతా... సీతా!'' అని పిలిచాడు. పలకలేదు. కంగారుగా కదిపిచూసాడు. చలనం లేదు. చెయ్యిపట్టుకొని చూసాడు... ''నా సీత.. నా సీత... లేదు. అలా జరక్కూడదు. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి. యిప్పుడే తీసుకెళతాను. సీతా...'' అంటూ కంగారుగా యిల్లంతా కలియ తిరగాడు. బట్టల పెట్టెలో బీరువాలో అన్ని చోట్లాచూసాడు. ఎక్కడా చిల్లిగవ్వ కనిపించలేదు. సీత చేతులొంక ఆత్రంగా చూసాడు. బోసిగా వెక్కిరించా యి చేతులు. ఆశగా సీత మెడలో తాడు తీసాడు పసిడి మంగళ సూత్రాలకు బదులుగా పసుపుతాడు వుంది.

''చివరికి యివి కూడ నా వ్యసనానికే అర్పించావా సీతా... నిన్నెలాగైనా రక్షించుకుంటాను. ఇప్పుడే వస్తాను, సీతా యిప్పుడే వస్తాను'' అంటూ వీధిలోకి పరుగెత్తాడు.

* * *

''ఏమిటయ్యా రాజారావు నువ్వు చెప్పేది. నిన్న మీ చిట్టి తల్లికి వాంతులు... యివ్వాళ నీ భార్య చావు బ్రతుకుల మధ్య ఉందా. నువ్వడిగి నప్పుడల్లా యివ్వడానికి నా దగ్గర చెట్టేమైన వుందనుకున్నావా. అయినా నీలాంటి తాగుబోతుకి డబ్బుయివ్వడం నా తప్పు ఇచ్చిన మట్టుకు చాలు. ఇకవెళ్ళు'' అని కటువుగా అన్నాడు సత్యమూర్తి.




''ఏవండీ రాజారావు గారూ! ఇలా ఎంతకాలం దోచుకుందామనుకున్నారు. నిన్న మీరు తాగి లారీ కింద పడబోతే ఆ రఘుపతి 'గారు కాపాడి యింటికి తీసికెడుతుంటే మా పక్కింటి కామేశ్వరావుగారు చూశారట. మీ అమ్మాయికి వాంతులో... మీ ఆవిడికి జబ్బో మాకు బాగా తెలుసుగాని యిక వెళ్ళండి...'' అని చివాట్లు పెట్టింది కామాక్షి.

ఇక ఒక్క క్షణం వాళ్ళ ఎదుట నిలబడలేక పోయాడు రాజారావు. తల దించుకొని బయటకు నడిచాడు.

* * *

''లేదయ్యా నీరక్తం పరీక్షించాను. బ్లడ్ కంప్లీట్ పాడయింది. అది పనికి రాదు. నీ బ్లడ్ తీసుకున్నా ప్రయోజనం లేదు'' అన్నాడు డాక్టర్.

''కాదు డాక్టర్ నాకు డబ్బు చాలా అవసరం. నా బ్లడ్ తీసుకొని డబ్బు యివ్వండి. నా భార్యను డాక్టర్‌కు చూపించాలి. లేకపోతే నా భార్య చచ్చిపోతుంది. నాకు డబ్బు అవసరం.''

''సారీ మిష్టర్. నీ రక్తం మాత్రం తీయడానికి వీలు లేదు. ఐ పిటీ యువర్ కండిషన్. కావాలను కొంటె డాక్టర్‌గా సాటి మనిషిగా సాను భూతితో నే వచ్చి వైద్యం చేస్తాను.''

''నిజంగా మీరు దేవుడు డాక్టర్... మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేను. త్వరగా రండి డాక్టర్...'' అన్నాడు రాజారావు.

* * *

రాజారావు డాక్టర్‌తో యింటిలోకి ప్రవేశించాడు. ఇంటిలో ఎక్కడా అలికిడి లేదు. సీతా.. పిల్లలు కనిపించలేదు. రాజారావుకు మతిపోయింది. ఇల్లంతా కలయ చూశాడు. ''సీతా... చిన్నా... చిట్టీ'' అంటూ బొంగురు పోయిన కంఠంతో పిచ్చిగా పిలిచాడు. ఎదురుగా మంచం మీద వున్న కాగితం ఫేన్ గాలికి రెపరెపలాడుతూ కనిపించింది. రాజారావు గుండెల్లో పిడుగుపడ్డట్లు అనిపించింది. వణుకుతున్న చేతుల్తో వుత్తరం తీసాడు.

''రాజారావు గార్కి,

మీ భార్యగా ఈ వుత్తరం వ్రాయడం లేదు. మగావాడి అహంకారాన్ని ఎదిరించి స్వతంత్ర జీవితాన్ని గడపాలనుకునే ఓ స్త్రీగా... వ్రాస్తున్నాను.

జీవిత భాగస్వామిని గౌరవించలేని మీ సంస్కారం మీ నుండి దూరంగా నన్ను నెట్టివేసింది. భర్తగా బాధ్యతల్ని కన్నబిడ్డలు కోరుకొనే ప్రేమానురాగాలను పంచియివ్వలేని మీ మనస్సు మీ నుండి దూరంగా పారిపొమ్మంది.

అందుకే పిల్లల్ని తీసుకొని దూరంగా వెళ్ళిపోతున్నాను. జీవితాన్ని జయించాలనే ఉద్దేశ్యంతో.

—సీత.

రాజారావు కాళ్ళ క్రింద నేల పగిలి పోయింది. ఒక్కసారిగా ''సీతా...'' అని పెద్దగా కేక పెట్టాడు.

డాక్టర్, రాజారావు వంక అలాగే చూస్తూ ఉండిపోయాడు. చేతిలోని ఉత్తరం జారి క్రింద పడిపోయింది.

*